మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- పట్టణాలతో సమానంగా పల్లెలను అభివృద్ధి చేశాం
- ప్రతి గ్రామానికి రోడ్లు నిర్మించాం
- ఉపాధి కల్పనకు ప్రభుత్వం పెద్దపీట
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి


డ్రైవింగ్ స్కూల్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన


ఎద్దుపెంట -అనుంపల్లె రోడ్డును ప్రారంభించి పాదయాత్ర చేస్తున్న మంత్రి బుగ్గన

డోన్ : మౌలిక వసతుల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిందని, పట్టణాలతో సమానంగా పల్లెలను అభివృద్ధి చేశామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు రవాణ, ఉపాధి రంగాలతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మండలంలోని కొత్తకోట గ్రామం వద్ద రూ.20కోట్లతో నిర్మించిన ఐటీడీఆర్ డ్రైవింగ్ శిక్షణా కేంద్రాన్ని శనివారం మంత్రి ప్రారంభించారు. అంతకుముందు ఎద్దుపెంట గ్రామంలో కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయంతో పాటు రూ.1.70కోట్లతో రెండు కి.మీ. నిర్మించిన ఎద్దుపెంట–అనుంపల్లె రహదారిని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించి ఆ రోడ్డుపై పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు కల్పించాలనే ఉద్దేశంతో కేడీసీసీ బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రహదారి సౌకర్యాలు గ్రామీణ ప్రాంతాలకు చక్కగా ఉంటేనే అన్ని రకాలుగా ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అంకితభావంతో డోన్‌ను మోడల్ నియోజకర్గంగా తీర్చిదిద్దామని, నూటికినూరు శాతం అన్ని గ్రామాలకు నూతనంగా రహదారులను ఏర్పాటు చేశామని వివరించారు. పార్టీలు,కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘతన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, మీ గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రతిఒక్కరూ గమనించాలని కోరారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా మంత్రి బుగ్గన కోరారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కొత్తకొట వద్ద ఐటీడీఆర్ డ్రైవర్ల శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసామని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి బుగ్గన సూచించారు. దశల వారీగా యువకులకు ఈ కేంద్రంలో డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి టాటా, అశోక్‌లేలాండ్ లాంటి పెద్ద పెద్ద కంపెనీల్లో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కేంద్రాన్ని ఈ ప్రాంతం యువకులు సద్వినియోగం చేసుకుంటే మంచి జీతభత్యాలతో ఉపాధి దొరుకుతుందని చెప్పారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, జిల్లా రవాణ అధికారి శివారెడ్డి, ఎంవీఐలు క్రాంతికుమార్, ఏఎస్ఎన్ రెడ్డి, రవిశంకర్‌నాయక్, తిమ్మయ్య నాయుడు, రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ నాగరాజు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయితీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈ నాగిరెడ్డి, ఏఈ నారాయణ, ఆర్డీఓ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, కొత్తకొట సర్పంచ్ చంద్రన్నయాదవ్, ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర, కేడీసీసీ బ్యాంక్ జిల్లా డైరెక్టర్ సీమ సుధాకర్ రెడ్డి, బస్తీపాడు సుధాకర్ రెడ్డి, డోన్ బ్యాంక్ చైర్మన్ తిరునాంపల్లె తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఓబులాపురం మదన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదనరెడ్డి, యాపదిన్నే నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమాజ సేవలో భాగస్వాములు కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తుజావలీ

బేతంచెర్ల: యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలి, ఆదర్శ జీవనం గడపాలని మండల ఖాజీ నూర్ అహ్మద్, ముస్లిం మైనార్టీ పెద్దలు మూర్తుజావలీ, ఖాజ, ముఫ్తి అజ్మతుల్లా, సత్తార్, సాదిక్ సూచించారు. శనివారం పట్టణంలోని పాతబస్టాండ్ సమీపాన బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్‌వలీ, సద్దామ్ అలీబేగ్, ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్, శేక్షావలీ ఆధ్వర్యంలో బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ నూతన కార్యలయాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజిక బాధ్యతగా పేద ముస్లింలకు, అట్టడుగు వర్గాల వారికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పిట్టల జాకీర్, వన్నూర్ సాహేబ్, మాబాషా, సయ్యద్, ఖాజా, సలీమ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉరుసు

కోవెలకుంట్ల: పట్టణ శివారులో వెలసిన నూర్ షావలి దర్గాలో శనివారం నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మత సామరస్యానికి ప్రతీకగా ఆలయంలో ఒక వైపు శివాలయం, మరోవైపు నూర్‌షావలి దర్గా నిర్మాంచారు. ప్రతి ఏటా శివరాత్రి రోజున శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు, మరుసటి రోజు నుంచి రెండు రోజులపాటు నూర్‌షావలి దర్గాలో ఉరుసు ఉత్సవాలు జరపడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం శివరాత్రి ఉత్సవాలు ముగియడంతో నూర్‌షావలిదర్గాలో గంధం ఉత్సవం నిర్వహించారు. ఆదివారం దర్గాలో ఉరుసు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి


మహిళా ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

డోన్ టౌన్ : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని యూటీఎఫ్ రాష్ట ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో శనివారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ప్యాపిలి కమిటీ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయురాళ్లనును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులుతీఫ్, అరుణ కుమారీ, ఉమాదేవీ పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం ఏర్పాటు


క్రీడా ప్రాంగణాన్ని చదును చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో యువత కోరిక మేరకు సర్పంచ్ జొన్నగిరి సరోజమ్మ క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. గ్రామంలో కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, షటిల్ తదితర క్రీడాకారులు అధిక సంఖ్యలో ఉన్నారు. అయితే తమకు అనువైన క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కొద్ది రోజుల క్రితం సర్పంచ్‌ను కోరారు. ఈ మేరకు స్పందించిన సర్పంచ్, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో క్రీడా ప్రాంగణం మంజూరు చేశారు. సర్వే నంబర్ 77 లోని 2.5 ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు క్రీడా ప్రాంగణాన్ని చదును చేశారు. ఈ మేరకు క్రీడాకారులు మంత్రి, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

ప్యాపిలి: ఎరుకల సోదరులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎరుకల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గోపాల్ పిలుపునిచ్చారు. ఎరుకల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడిగా గోపాల్, ఉపాధ్యక్షుడిగా సుంకన్న, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, ఉప ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా శేఖర్, అడ్వైజర్‌గా సుధాకర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఎరుకల సోదరులు తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ఎరుకల సోదరులు ఐక్యత చాటుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సుంకన్న, శీను, శేషాద్రి, వెంకటేష్, శేఖర్, సుధాకర్, పెద్దయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి

బనగానపల్లె రూరల్ : మెడికల్ షాపులకు వచ్చే వినియోగదారులకు సరసమైన, నాణ్యత కలిగిన మందులను అందించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం బనగానపల్ల పట్టణంలోని సబ్ పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఏకే ఫార్మసీ మెడికల్ స్టోర్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ మృతి

డోన్ టౌన్ : పట్టణానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ చాపల వీరన్న (64) అనారోగ్యతో శనివారం మృతి చెందాడు. కొంత కాలంగా కర్నూలుల్లో వైద్య చికిత్సలు పొందుతున్న వీరన్న కోలుకోలేక మృతి చెందాడు. డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరామ్, నాయకులు ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

యువకుల హల్‌చల్

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వెంకటాపురం సర్కిల్‌లో శనివారం సాయంత్రం మద్యం మత్తులో యువకులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ హల్ చల్ సృష్టించారు. స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. జాతీయ రహదారిలో బార్, మద్యం షాపులతో పాటు హోటళ్లల్లో యువకులు మద్యం సేవిస్తూ తరచు గోడవలు, దాడులకు పాల్పడుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వీటిని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సోదరులు


మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సోదరులు

డోన్ : మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ సర్పంచ్ దివంగత బాల వెంకటరెడ్డి కుమారులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి తమ అనుచరులైన 30 కుటుంబాలతో కలిసి శనివారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి బుగ్గన పార్టీ కండువగా కప్పి సాధరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రాజేశ్వరరెడ్డి, మురళీధర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మహేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా సాగిన బండ లాగుడు పోటీలు


బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని పెట్నికోట– నాయినపల్లె గ్రామాల మధ్య వెలసిన గుండుమల్లేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత కాటసాని ప్రసాదరెడ్డి ప్రారంభించిన బండలాగుడు పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంజామల మండల కానాలకు చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు మొదటి స్థానం కైవసం చేసుకోవాగా రెండవ స్థానంలో ముక్కమళ్లకు చెందిన మూసాని చంద్రశేఖర్‌రెడ్డి వృషభాలు నిలిచాయి. అదేవిధంగా బనగానపల్లె మండలం సాధుకొట్టానికి చెందిన సంగు గోపాల్‌రెడ్డి వృషభాలు మూడవ స్థానం, ప్యాపిలి మండలం డి.రంగాపురానికి చెందిన సందీప్‌రెడ్డి వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచాయి. వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, నాయకులు మూల ఈశ్వరరెడ్డి, రామసుబ్బయ్య, కొండారెడ్డి, సంజీవరెడ్డి, సత్తిగారి రామిరెడ్డి, కామిని గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో విజేత వరదాయపల్లి


విజేతకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీల్లో అనంతపురం జిల్లా వరదాయపల్లికి చెందిన వృషభాలు విజేతగా నిలిచాయి. నిర్వాహకులు మెట్టు నాగపురుషోత్తం రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త మెట్టు రామేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. వరదాయపల్లికి చెందిన బెస్త శ్రీరాములుకు చెందిన వృషభరాజములు విజేతగా నిలిచి రూ. 40వేలు కైవసం చేసుకున్నాయి. డోన్ మండలం కొచ్చెర్వుకు చెందిన బజారు లక్ష్మిదేమమ్మ వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 30 వేలు గెలుపొందాయి. తృతీయ స్థానంలో నిలిచిన పగిడ్రాయికి చెందిన గిరిజా వృషభాలు రూ.20 వేలు గెలుచుకున్నాయి. తుగ్గలి మండలం పెండేకల్లు గ్రామానికి చెందిన నాగభూషణం వృషభాలు నాలుగో స్థానంలో నిలిచి రూ.10 వేలు గెలుచుకున్నాయి. విజేత వృషభాల యాజమాన్యాలకు వ్యవసాయ సలహామండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, నిర్వాహకుల చేతుల మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో రాముడు శివారెడ్డి, తెలుగు కాశీం, నాగరాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

‘తల్లి’డిల్లిన మనసు !

- వాహనం ఢీకొని అప్పుడే జన్మించిన లేగదూడ మృతి
- మృతదేహం చుట్టూ తిరుగుతూ రోధించిన ఆవు
- అంత్యక్రియలకు తీసుకెళ్తుండగా అటకాయించిన వైనం


మృతి చెందిన లేగదూడ వద్ద తల్లి రోధన


పూల మాలలు వేస్తున్న స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్ : అమ్మ ఎవరికైనా అమ్మే అని మరోమారు నిరూపించింది ఓ గోమాత. పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ కింద ఉన్న మన గ్రోమోర్ దుకాణం వద్ద శనివారం అప్పుడే పుట్టిన ఆవు దూడను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందింది. లేగదూడ మృతదేహం చుట్టూ తిరుగూ తల్లడిల్లిన ఆవు చూపరులను కంటతడి పెట్టించింది. లేగ దూడ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకొచ్చిన స్ఫూర్తి సభ్యులను సైతం కొద్దిసేపు నిలువరించింది. మృతి చెందిన దూడకు అంత్యక్రియల కార్యక్రమాలు... మృతదేహాన్ని ఆటోలోకి ఎత్తుతుండగా ఆవు రోధించిన తీరును చూసి చలించిపోయారు చూపరులు. ఎట్టకేలకు మృతి చెందిన లేగదూడకు వెంకటాపురం చెరువు (అబ్బిరెడ్డి పల్లె చెరువు)సమీపంలో హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు స్ఫూర్తి సభ్యులు. కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు సీసీంగుంతల మధు, కొచ్చెర్వు నారాయణస్వామి, రామనాయుడు, శివ, రాఘవేంద్ర, వాల్మీకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతులకు అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు


స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె : యాగంటి క్షేత్రంలో మహాశివ రాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ దంపతులు శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆశీనులుగావించి మేళతాళాలతో కల్యాణ మండపం వరకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు, చైర్మన్ బుచ్చిరెడ్డి,ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా శనివారం తెల్లవారజామున స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవంతో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. యాగంటికి వచ్చిన భక్తులకు ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ,ఆర్యవైశ్య నిత్యాన్నదాన సంస్థ, రైతు నిత్యాన్నదాన సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ, తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి రవికుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, ఉమామహేశ్వరస్వామి నిత్యన్నదాన సంస్థ ఉపాధ్యక్షులు దస్తగిరిరెడ్డి, రామారెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని శివాలయాల్లో శనివారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీసెంటర్‌లో వెలసిన సిద్దేశ్వరస్వామి, కాశీవిశ్వనాథుని ఆలయాలు, ఏడుకొప్పెర్ల బావి సమీపంలో వెలసిన అగస్తీశ్వర స్వామి ఆలయం, గాంధీనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో వెలసిన శివాలయం, బనగానపల్లె చౌరస్తాలో నాగలింగేశ్వరస్వామి, పట్టణ శివారులోని జుర్రేరు ఒడ్డున ఉన్న శివాలయం, పాటిమీద పాత శివాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా జరిగింది. అదేవిధంగా వెలగటూరు, బిజనవేముల, భీమునిపాడు, గుళ్లదూర్తి గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో వేద పండితుల ఆధ్వర్యంలో ఉమామహేశ్వరుల కల్యాణోత్సం అంగరంగ వైభవంగా కొనసాగింది. అనంతరం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో పురవీధులగుండా గ్రామోత్సవం నిర్వహించారు.

డోన్ టౌన్ : మహాశివరాత్రి ఉత్సవాలను పురష్కరించుకొని పాతబుగ్గ, కొత్తబుగ్గలలో వెలసిన శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు అర్చకులు అత్యంత భక్తి శ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, కొత్రికె, బైసాని వంశీకులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా ముచ్చట్ల భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణం


ముచ్చట్ల మల్లికార్జున స్వామి, భ్రమరాంభ దేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ముచ్చట్ల భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణం శనివారం తెల్లవారుజామున అర్చకులు నరేష్ శర్మ, పుల్లయ్య శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. ఆదేవిధంగా పట్టణంలోని పూదోట మఠంలో వెలసిన భేతేశ్వరస్వామి, శ్యామలాంభ అమ్మవారికి భక్త జనసందోహం మధ్య కల్యాణం నిర్వహించారు. సిద్దేశ్వరస్వామి, బనగానపల్లె రహదారిలో వెలసిన జఠాధర స్వామి, మండల పరిధిలోని యంబాయి గ్రామంలో వెలసిన రామలింగేశ్వరస్వామి, భోగేశ్వర స్వామి, సిమెంటునగర్‌లో వెలసిన జీవబుగ్గ లింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డీపీఎస్ గుప్త, వెంకటరమణ, కోశాధికారి మధు సురేంద్ర, ముచ్చట్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుండా జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రూప్ దేవాలయాల ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త మల్లుహుసేన్‌రెడ్డి, పూదోట ఆశ్రమ కమిటీ సభ్యులు గుండాగోపాలు, సముద్రాల, దామోదరయ్య, పాల్గొన్నారు.


డోన్‌లో స్వామి,అమ్మవార్ల గ్రామోత్సవ దృశ్యం


స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


కోవెలకుంట్లలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మతస్థిమితంలేని మహిళ అదృశ్యం


మణెమ్మ

డోన్ టౌన్ : తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా, మండల కేంద్రం ఘన పురానికి చెందిన మతిస్థిమితం లేని బుడిగ జంగం మణెమ్మ డోన్‌లో అదృశ్యమైనట్లు పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి శనివారం తెలిపారు. వారం కిందట డోన్ పట్టణంలోని బంధువులను కలువడానికి బుడిగ జంగం మణెమ్మ వచ్చిందన్నారు. గుత్తికి వెళ్తున్నట్లు చెప్పిన మణెమ్మ ఇప్పటి వరకు రాలేదు. దీంతో బంధువులు పోలీసులను ఆశ్రయించారు. ఈమె గురించి తెలిస్తే 9985841148కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

తీరనున్న తాగునీటి సమస్య

- గ్రౌండ్‌లెవల్ సంప్ నిర్మాణం పూర్తి


మోడల్ స్కూల్ సమీపంలో నిర్మించిన గ్రౌండ్ లెవల్ సంప్

కొలిమిగుండ్ల: అవుకు రిజర్వాయర్ నుంచి కొలిమిగుండ్ల మండలంలోని గ్రామాలకు తాగునీరు అందించేందుకు నిర్మించిన సీపీడబ్ల్యూస్కీం ప్రారంభానికి సిద్ధమైంది. రెండు మూడు రోజుల్లో ఈస్కీంను ప్రారంభించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.8.5 కోట్లతో మూడో ఫేజ్ కింద మండలంలోని బెలుం శింగవరం, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, రాఘవ రాజుపల్లె, అంకిరెడ్డిపల్లె, తుమ్మలపెంట, చింతలాయిపల్లె, తిమ్మనాయినపేలతో పాటు మొత్తం తొమ్మిది గ్రామాలకు నీటి సరఫరా కల్పించనున్నారు. కొలిమిగుండ్లలో మోడల్ స్కూల్ సమీపంలో 2లక్షల లీటర్ల సామర్థ్యంతో గ్రౌండ్ లెవల్ సంప్ నిర్మించి అక్కడే భారీ మోటార్లు ఏర్పాటు చేశారు. తొమ్మిది గ్రామాలకు పైపులైన్ సాయంతో నీటి సరఫరా అందించనున్నారు. పనులన్నీ పూర్తి కావడంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చురుగ్గా ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్అండ్‌బీ రహదారిలో మరమ్మతు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రధానర హదారిలో పలు ప్రాంతాల్లో రోడ్డు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రాష్ట ప్రభుత్వం ప్రయాణికుల కష్టాలను గుర్తించి ఆర్అండ్‌బీ రహదారిలో ప్యాచ్ వర్క్‌లకు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆ నిధులతో ఆయా ప్రాంతాల్లో ప్యాచ్‌వర్క్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో వాహనచోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్డుపై ప్యాచ్ వర్క్ చేస్తున్న దృశ్యం